

# ఒకే ఘటనపై 3 కేసులా?

- వేర్వేరు కేసులు ఎందుకు నమోదు చేశారు?
- పోలీసులకు హైకోర్టు ప్రశ్నలు
- పట్నం పిటిషన్‌పై తీర్పు వాయిదా

హైదరాబాద్, కొడంగల్, నవంబర్ 25 (నమస్తే తెలంగాణ): లగచర్ల ఘటనపై బొంరాస్‌పేట పోలీసులు 3 వేర్వేరు కేసులు నమోదు చేయడాన్ని సవాలు చేస్తూ కొడంగల్ మాజీ ఎమ్మెల్యే పట్నం నరేందర్‌రెడ్డి దాఖలు చేసిన పిటిషన్‌పై సోమవారం హైకోర్టులో విచారణ జరిగింది. ఈ 3 కేసుల్లో కేవలం తేదీలు తప్ప విషయం మాత్రం ఒక్కటేనని, ఆ ఎఫ్‌ఐఆర్‌లలో కొత్త విషయం ఏమీలేదని జస్టిస్ కే లక్ష్మణ్ వ్యాఖ్యానించారు. ఒకే అంశంపై 3 ఎఫ్‌ఐఆర్‌లను నమోదు చేయడంలో ఆంతర్యం ఏమిటని పోలీసులను ప్రశ్నించారు. ఫిర్యాదులను ఎమ్మార్వో, డీఎస్పీ రాసివ్వకుండా పోలీస్ స్టేషన్‌లోని రైటర్ పేరుతో రాయడం ఏమిటని నిలదీశారు. రైటర్ కూడా విచక్షణ లేకుండా అప్పటికే నమోదైన ఎఫ్‌ఐఆర్‌ను కాపీ కొట్టి మరో 2 కేసులను నమోదు చేయడం దారుణమని ఆగ్రహం వ్యక్తం చేస్తూ.. ఏ నిబంధన కింద బహుళ ఎఫ్‌ఐఆర్‌లు నమోదు చేశారని ప్రశ్నించారు. ఇరుపక్షాల వాదనలు ముగియడంతో తీర్పును తర్వాత వెలువరిస్తామని న్యాయమూర్తి ప్రకటించారు.

### పట్నం బెయిల్ పిటిషన్

లగచర్ల ఘటనకు సంబంధించి పోలీసులు తనపై నమోదు చేసిన ఓ కేసు (ఎఫ్‌ఐఆర్ 154)లో బెయిల్ ఇవ్వాలని కోరుతూ పట్నం నరేందర్‌రెడ్డి హైకోర్టులో పిటిషన్ వేశారు. రాజకీయ కక్షతో కుట్రపూరితంగా ఈ కేసు నమోదు చేశారని పేర్కొన్నారు. లగచర్ల రైతుల ఆగ్రహం వెనుక నరేందర్‌రెడ్డి పాత్ర ఉన్నదని ఆరోపిస్తూ ఆయనపై బొంరాస్‌పేట పోలీసులు కేసు (ఎఫ్‌ఐఆర్ 153) నమోదు చేసిన విషయం తెలిసిందే. ఈ కేసులో అరెస్టు చేయడంతో ప్రస్తుతం రిమాండ్‌లో ఉన్నారు. ఇదే ఘటనలో ఇతరుల ఫిర్యాదు ఆధారంగా ఆయనపై మరో రెండు కేసులు నమోదు చేశారు.

# గిరిజనులు భూములిచ్చే పరిస్థితి లేదు



వికారాబాద్ జిల్లా లగచర్ల, రోటిబండ తండాల్లో పర్యటించి గిరిజనుల నుంచి వివరాలు సేకరిస్తున్న రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య, సభ్యులు

- ప్రభుత్వం ప్రత్యామ్నాయ మార్గాలు చూసుకోవాలి
- అమాయకులను జైల్లో పెట్టారు
- లగచర్ల బాధితుల విడుదలకు చర్యలు చేపట్టాలి
- రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య

వికారాబాద్/కంది, నవంబర్ 25 (నమస్తే తెలంగాణ): గిరిజనులు భూములిచ్చే పరిస్థితిలేదని, ప్రభుత్వం ప్రత్యామ్నాయ మార్గాలను చూసుకోవాలని ప్రభుత్వానికి సూచించి గిరిజనులకు న్యాయం జరిగేలా చూస్తామని రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య పేర్కొన్నారు. సోమవారం వికారాబాద్ జిల్లా లగచర్ల, రోటిబండతండాల్లో ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్యతోపాటు సభ్యులు లీలాదేవి, రాంబాబునాయుడు, జిల్లా శంకర్ పర్యటించారు. సోమవారం సాయంత్రం సంగారెడ్డి జిల్లా కంది జైలులో ఉన్న లగచర్ల బాధితులనూ పరామర్శించారు. ఈ సందర్భంగా గిరిజనులతో మాట్లాడి లగచర్ల ఘటనపై వాస్తవ పరిస్థితులను తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ గిరిజనులపై అన్యాయంగా పెట్టిన కేసులను ఎత్తివేయాలని ప్రభుత్వాన్ని కోరుతామని చెప్పారు. అవసరమైతే ముఖ్యమంత్రిని కలిసి లగచర్ల ఘటనపై పరిస్థితులను తెలియజేస్తామని చెప్పారు. 2013 భూ సేకరణ చట్టం ప్రకారం గ్రామంలో నోటీసులు ఇచ్చి, చాటింపు వేయించాలి.. గ్రామసభ ఏర్పాటు చేసి ప్రజాభిప్రాయ సేకరణ చేయాలని చెప్పారు. దఫా దఫాలుగా ప్రజలతో చర్చించి సమస్య పరిష్కరించాలి కానీ.. ఒకేసారి గ్రామానికి వచ్చే వరకు ఏదో జరుగుతుందనే ఆందోళనతోనే ఈ ఘటన జరిగిందని చెప్పారు. కలెక్టర్‌పై దాడిని ఖండిస్తున్నామని, దాడి పేరిట అమాయక గిరిజనులను జైల్లో పెట్టడం సరైనదికాదని అన్నారు. దాడికి సంబంధంలేని వారిని తక్షణమే జైలు నుంచి విడుదల చేసి కేసులను ఎత్తివేయాలని ప్రభుత్వానికి సూచించారు. బాధితులకు ఎస్సీ, ఎస్టీ కమిషన్ అండగా ఉంటుందని, వారికి న్యాయం జరిగే వరకూ పోరాటం చేస్తామని చెప్పారు. ఎస్సీ,ఎస్టీ అట్రాసిటీ కేసులకు స్టేషన్‌బెయిల్ ఇవ్వడం సరికాదని, ఇది ఎస్సీ, ఎస్టీ యాక్టుకు విరుద్ధమని తెలిపారు.

## నేను వద్దన్నా సీఎం చేస్తుండు

### ఫార్మాపై గుర్నాథ్‌రెడ్డి స్పందనను వివరించిన గిరిజనులు

### సీఎం దగ్గరికి తీసుకువెళ్తానన్నాడని తెలిపిన రైతులు

రాష్ట్ర ఎస్సీ ఎస్టీ కమిషన్ సోమవారం వికారాబాద్ జిల్లా మద్దూరు మండలంలోని ఫార్మా బాధిత గ్రామాల్లో పర్యటించింది. ఈ సందర్భంగా బాధిత రైతుల నుంచి వివరాలు తెలుసుకుంటూ ఎవరెవరిని కలిసి ఫార్మా వద్దని వినతి పత్రాలు ఇచ్చారని ప్రశ్నించింది. దానికి సమాధానంగా స్థానిక రైతులు సీఎం రేవంత్ రెడ్డిని కలుద్దామని విశ్వ ప్రయత్నాలు చేసి విఫలమయ్యామన్నారు. స్థానిక కాంగ్రెస్ నేత, రాష్ట్ర పోలీసు హౌజింగ్ కార్పొరేషన్ చైర్మన్ గుర్నాథ్‌రెడ్డిని నాలుగైదు సార్లు కలిసి కాళ్లమీద పడ్డామని చెప్పారు. భూ సేకరణపై గుర్నాథ్ రెడ్డి ఏం అంటున్నారని ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య గిరిజనులను అడుగగా 'నేను వద్దన్నా కానీ సీఎం చేస్తుండు, నా చేతకాదని, తర్వాత అపాయింట్‌మెంట్ తీసుకొని సీఎం వద్దకు తీసుకుపోతా' అని చెప్పారని గిరిజనులు వివరించారు. సీఎం తమ సోదరుల మాట తప్ప ఎవ్వరి మాట వినడం లేదని దీనిని బట్టి అర్థమవుతున్నదని గిరిజనులు వాపోయారు. భూ సేకరణకు నోటీసులు ఇచ్చారా అని అడిగితే 'మాకేం ఇవ్వలేరని, బ్యాంకుల అప్పు ఇవ్వకపోయే వరకు తెలిసిందని' గిరిజనులు తెలిపారు. తదనంతరం సీఎంను కలిసేందుకు కొడంగల్‌కు వెళ్తుంటే మధ్యలోనే మమ్మల్ని అరెస్ట్ చేసి మద్దూరు పోలీస్‌స్టేషన్‌కు తరలించారని... మా బాధను మేం ఎవరికి చెప్పుకోవాలి, ఎవరని అడగాలని గిరిజనులు ఆవేదన వ్యక్తం చేశారు. ప్రాణాలైనా వదులుకుంటాంకానీ భూములు వదులుకోమని రైతులు అంటున్నారని, ప్రత్యామ్నాయ భూములను చూసుకోవాలని ప్రభుత్వానికి సూచిస్తామని ఎస్సీ, ఎస్టీ కమిషన్ సభ్యులు భరోసానిచ్చారు.

# పంట భూములు తీసుకోవద్దు

- కంపెనీల కోసం పంట భూములు వద్దని చట్టంలో స్పష్టంగా ఉన్నది
- తెలంగాణ రైతు సంక్షేమ సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు, విశ్రాంత న్యాయమూర్తి జస్టిస్ బీ చంద్రకుమార్



కరీంనగర్ తెలంగాణచౌక్, నవంబర్ 25: కంపెనీల ఏర్పాటుకు పంటలు పండించే రైతుల భూములను తీసుకోవద్దని చట్టంలో స్పష్టంగా ఉన్నదని తెలంగాణ రైతు సంక్షేమ సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు, విశ్రాంత న్యాయమూర్తి బీ చంద్రకుమార్ పేర్కొన్నారు. ప్రజాభిప్రాయ సేకరణలో రైతులు వ్యతిరేకిస్తే ఆ భూములను ప్రభుత్వం తీసుకోవద్దని చెప్పారు. ప్రభుత్వ చర్యలు రైతులకు లాభం చేసేలా ఉండాలి కానీ నష్టం చేసేలా ఉండవద్దని తెలిపారు. కరీంనగర్ ప్రెస్ భవనంలో సోమవారం సంఘం జిల్లా కమిటీ సభ్యులతో కలిసి ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో చంద్రకుమార్ మాట్లాడారు. రైతుల సంక్షేమ కోసం వ్యవసాయ శాస్త్రవేత్త ఎమ్ఎస్ స్వామినాథన్ సిఫార్సులను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేయాలని డిమాండ్ చేశారు. రైతులు దళారుల చేతిలో మోసపోతున్నారని ఆవేదన చెందారు. పంటలకు మద్దతు ధర నిర్ణయించే అధికారం రైతులకే అప్పగించాలన్నారు. వ్యవసాయ రంగంలో రసాయనాల వాడకం పెరగడంపై ఆందోళన వ్యక్తం చేశారు. సమావేశంలో వర్ణ వెంకటరెడ్డి, దేవయ్య పాల్గొన్నారు.



కడా ప్రత్యేకాధికారి వెంకట్‌రెడ్డితో మాట్లాడుతున్న జాతీయ మావన హక్కుల కమిషన్ సభ్యులు

## 'కడా' ప్రత్యేకాధికారితో ఎన్‌హెచ్చార్సీ భేటీ

- లగచర్ల ఘటనపై ఆరా

కొడంగల్, నవంబర్ 25: వికారాబాద్ జిల్లా దుద్యాల మండలంలోని లగచర్ల ఘటనపై జాతీయ మానవ హక్కుల కమిషన్ అధికారుల విచారణ కొనసాగుతున్నది. ఇందులో భాగంగా జాతీయ మానవ హక్కుల కమిషన్ డిప్యూటీ రిజిస్ట్రార్ ఆఫ్ లా ముఖేష్, కమిషన్ సభ్యులు రోహిత్ సింగ్, ప్రకాశ్‌శర్మ సోమవారం పట్టణంలోని 'కడా' కార్యాలయాన్ని సందర్శించారు. కడా ప్రత్యేకాధికారి వెంకట్‌రెడ్డితో సమావేశమై లగచర్ల ఘటన వివరాలను సేకరించారు. ఈ నెల 11న ఏం జరిగింది?, ఘటనకు గల కారణాలపై ఆరా తీశారు.

# రైతులను బెదిరించి భూములు లాక్కోవద్దు

- పోలీసు బలగాల నడుమ సర్వే ఏంటి?
- ఫోర్త్‌సిటీకి 330 ఫీట్ల రోడ్డు అవసరం లేదు
- మాజీ మంత్రి, ఎమ్మెల్యే సబితాఇంద్రారెడ్డి



కందుకూరు, నవంబర్ 25 : ఫోర్త్ సిటీ పేరుతో రైతులను బెదిరించి భూములు లాక్కోవద్దని మాజీ మంత్రి, ఎమ్మెల్యే సబితాఇంద్రారెడ్డి రాష్ట్ర ప్రభుత్వాన్ని హెచ్చరించారు. పోలీసులను మోహరించి భూములను సర్వే చేయడంపై ఆమె మండిపడ్డారు. ఫోర్త్‌సిటీ ఏర్పాటుచేస్తున్నారా? లేక ఫార్మాసిటీని కొనసాగిస్తారా అనే విషయంపై స్పష్టత ఇవ్వాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సోమవారం మండల కేంద్రంలోని సామ నర్సింహారెడ్డి ఫంక్షన్ హాల్‌లో ఏర్పాటుచేసిన సమావేశంలో ఆమె మాట్లాడుతూ.. పోర్త్‌సిటీకి ప్రత్యేకంగా 330 ఫీట్ల రోడ్డు అవసరం లేదని, ఈ విషయంపై సీఎం రేవంత్‌రెడ్డికి లెటర్ రాస్తానని తెలిపారు. ఫార్మాసిటీ కోసం మాజీ సీఎం కేసీఆర్ రైతులను ఒప్పించి 14వేల ఎకరాల భూముల సేకరించినట్టు గుర్తుచేశారు. ఫోర్త్‌సిటీ ఏరియాలో రియల్ వ్యాపారం కోసమే రోడ్డు అవసరమని, అందుకోసమే ప్రభుత్వం చాలెంజ్‌గా భూములు తీసుకుంటుందని ఆరోపించారు. పేద రైతులకు అన్యాయం జరిగితే ఊరుకునేది లేదని హెచ్చరించారు. ఇప్పటికైనా సీఎం రేవంత్‌రెడ్డి రైతుల భూములను లాక్కోవద్దని సూచించారు. సమావేశంలో మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ సురుసాని సురేందర్‌రెడ్డి, బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు మన్నె జయేందర్‌ముదిరాజ్, సీనియర్ నాయకులు కాకి దశరథముదిరాజ్, వర్కింగ్ ప్రెసిడెంట్ ఎలుక మేఘనాథ్‌రెడ్డి, మహిళా అధ్యక్షురాలు, మాజీ ఎంపీటీసీ తాండ్ర ఇందిరమ్మాదేవేందర్, మాజీ సర్పంచ్ కాసుల రామక్రిష్ణారెడ్డి, డైరెక్టర్ పొట్టి ఆనంద్, మాజీ డైరెక్టరు సామ ప్రకాశ్‌రెడ్డి, గయ్యని సామయ్య, శ్రీధర్, పర్వతాలు యాదవ్, సలావుద్దీన్, రాజు, జంగయ్య తదితరులు పాల్గొన్నారు.

## బావర్చి బిర్యానీలో సిగరెట్

చిక్కడపల్లి, నవంబర్ 25: హైదరాబాద్ ఆర్టీసీ క్రాస్ రోడ్స్‌లోని బావర్చి రెస్టారెంట్ బిర్యానీలో సిగరెట్ ముక్క వచ్చిందంటూ కస్టమర్లు యాజమాన్యానికి ఫిర్యాదు చేశారు. బావర్చిలో రెస్టారెంట్ బిర్యానీలో గతంలో ఎలుక, బల్లి వచ్చినట్టు ఫిర్యాదులున్నాయి. ఇప్పుడు సిగిరెట్ ముక్క రావడం కలకలం రేపింది. ఈ వార్త సోషల్ మీడియాలో చక్కర్లు కొట్టింది. దీనిపై స్థానిక పీఎస్‌లో ఎలాంటి ఫిర్యాదు అందలేదని తెలుస్తున్నది. ఇప్పటికైనా ఫుడ్ ఇన్‌స్పెక్టర్లు తనిఖీలు చేసి తగిన విధంగా చర్యలు తీసుకోవాలని బిర్యానీప్రియులు కోరుతున్నారు.

మరిన్ని వార్తలు ntnews.comలో చూడగలరు




# ఫార్మా పొగ... సిమెంట్ సెగ!

మొదటిపేజీ తరువాయి...

ప్లాంటు ఏర్పాటు కూడా ప్రభుత్వ ప్రతిపాదనల్లో ఉందనే సంచలనాత్మక విషయం వెల్లడైంది.

### లగచర్ల లడాయి వీడక ముందే..

గతంలో కేసీఆర్ ప్రభుత్వం ఫార్మాసిటీ ఏర్పాటుకు 14వేల ఎకరాల పైచిలుకు భూసేకరణ పూర్తి చేసినప్పటికీ... రేవంత్‌రెడ్డి ప్రభుత్వం తెలంగాణలో పది ఫార్మా క్లస్టర్ల కోసం 20 వేల ఎకరాల వరకు భూసేకరణకు కంకణం కట్టుకున్నారు. ఇందులో భాగంగా కొడంగల్‌లో ఫార్మా క్లస్టర్ కోసం మొదటి దశ భూసేకరణ చేపట్టారు. కొడంగల్ నియోజకవర్గంలోని దుద్యాల - హకీంపేట - లగచర్ల - పోలేపల్లి వంటి ఏడు ప్రాంతాల్లో 1376 ఎకరాల సేకరణపై ప్రజాభిప్రాయ సేకరణ చేపట్టగా... లగచర్ల లడాయి తారాస్థాయికి చేరుకున్నది. ఎనిమిది నెలలుగా ఆ ప్రాంత ప్రజలు ఫార్మా కంపెనీల ఏర్పాటును వ్యతిరేకిస్తూ కంటి మీద కునుకు లేకుండా పోరాడుతూనే ఉన్నారు. తమ ప్రాణాలు పోయినా.. ఫార్మా కంపెనీలకు భూములిచ్చేదిలేదని తెగేసి చెబుతున్నారు. పచ్చని పంట పొలాల్లో కాలుష్యచిచ్చు పెట్టొద్దని రైతులు భారీ ఎత్తున ఉద్యమిస్తున్నారు. తాజాగా మరో విస్మయకరమైన విషయం వెలుగులోకి వచ్చింది. అదానీ వ్యవహారానికి సంబంధించి కాంగ్రెస్ అధిష్ఠానం సీఎం రేవంత్‌రెడ్డిపై గుర్రుగా ఉన్న నేపథ్యంలో సోమవారం మధ్యాహ్నం ముఖ్యమంత్రి ప్రెస్‌మీట్ నిర్వహించారు. ఈ సందర్భంగా తెలంగాణలో అదానీ గ్రూపు ప్రాజెక్టు వివరాలపై జాబితా విడుదల చేశారు. ఇందులో 11వ అంశంగా రామన్నపేటలో 6 మిలియన్ మెట్రిక్ టన్నుల సామర్థ్యంతో చేపట్టనున్న సిమెంట్ గ్రైండింగ్ యూనిట్‌పై ప్రజాభిప్రాయ సేకరణ జరిగిందని, పర్యావరణ అనుమతి కోసం ఎదురుచూస్తున్నట్టు పేర్కొన్నారు. 12వ అంశంగా కొడంగల్‌లో ఆదానీ సిమెంట్ ప్లాంటును 9 మిలియన్ మెట్రిక్ టన్నుల సామర్థ్యంతో ఏర్పాటుకు ఈవోఐను ప్రభుత్వానికి సమర్పించినట్టుగా తెలిపారు. అంటే ఈ ప్లాంటు ఏర్పాటుకు గుట్టుచప్పుడు కాకుండా ముమ్మర కసరత్తు జరుగుతున్నట్టుగా అర్థమవుతుంది.

### పచ్చని పొలాల్లో మరో చిచ్చు

ఉమ్మడి రాష్ట్రంలో మహబూబ్‌నగర్ జిల్లా అందునా కొడంగల్ నియోజకవర్గం అనేది మారుమూల ప్రాంతం. భూముల ధరలు కూడా తక్కువగా ఉండేవి. కానీ తెలంగాణ ఏర్పడిన తర్వాత జిల్లాల విభజనలో భాగంగా వికారాబాద్ జిల్లా ఏర్పడటం... గతంలో ఏమాత్రం సాగుకు అవకాశంలేని ప్రాంతంలో కాగ్నా నదికి మెరుగైన ఇన్‌ఫ్లోలు రావడం... ప్రతి ఏటా సమృద్ధిగా వర్షాలు కురవడంతో భూగర్భజలాలు గణనీయంగా పెరిగాయి. దీనికి తోడు కేసీఆర్ ప్రభుత్వంలో సమయానికి రైతుబంధు చేతికి అందడం, 24 గంటల ఉచిత కరెంటుతో మారుమూల ప్రాంతాల్లోనూ వ్యవసాయం పండుగలా మారింది. ఇందులో భాగంగా కొడంగల్ నియోజకవర్గంలోనూ రివర్స్ వలసలతో బీడు భూములు పచ్చని పొలాలయ్యాయి. అందుకే లగచర్ల ప్రాంతంలో ఫార్మా కంపెనీ ఏర్పాటును వ్యతిరేకిస్తూ రైతులు పెద్ద ఎత్తున ఉద్యమిస్తున్నారు. కేవలం ఇక్కడే కాదు... నియోజకవర్గంలో ఎక్కడకు వెళ్లినా రైతులు సమృద్ధిగా పంటలు పండించుకుంటున్నారు. ఈ నేపథ్యంలో ఫార్మా కంపెనీలే కాకుండా ఆదానీ సిమెంటు ప్లాంటుకు ప్రభుత్వం రెడ్‌కార్పెట్ పరుస్తుందనే సమాచారం సోమవారం వెల్లడికావడంతో నియోజకవర్గ ప్రజలు తీవ్ర ఆగ్రహం వ్యక్తంచేస్తున్నారు. ముఖ్యంగా సిమెంటు ప్లాంటు నుంచి కాలుష్య తీవ్రత ఎక్కువగా ఉంటుందని నిపుణులు చెబుతున్నారు. ఈ ప్లాంటు ఏర్పాటుకు మరిన్ని వందల ఎకరాల పచ్చని భూములను సేకరించక తప్పదనే వాస్తవం స్పష్టమవుతుంది.

## రాజన్న క్షేత్రం.. భక్తజనసంద్రం



కార్తీకమాసం చివరి సోమవారం వేములవాడ శ్రీ పార్వతీ రాజరాజేశ్వర స్వామివారి క్షేత్రం భక్తజనసంద్రమైంది. ఆలయ అద్దాల మండపంలో మహా లింగార్చన కార్యక్రమాన్ని వైభవంగా నిర్వహించారు. స్వామివారిని 80 వేలకు పైగా భక్తులు దర్శించుకోగా, వివిధ ఆర్జిత సేవల ద్వారా రూ.34లక్షల ఆదాయం సమకూరింది. ఆలయ ఈవో వినోద్‌రెడ్డి ఆధ్వర్యంలో ఏఈవో బ్రహ్మన్నగారి శ్రీనివాస్, పర్యవేక్షకులు వరి నర్సయ్య, తిరుపతిరావు, ఆలయ ఇన్‌స్పెక్టర్లు నూగూరి నరేందర్, నును గొండ రాజేందర్ ఏర్పాట్లను పర్యవేక్షించారు. వేములవాడ పట్టణ సీఐ వీరప్రసాద్ ఆధ్వర్యంలో ఎస్ఐ అంజయ్య బందోబస్తు చేశారు. -వేములవాడ టౌన్

## విద్యాశాఖ వింతపోకడ

- ప్రొసీడింగ్‌లో 24వ తేదీ.. జారీ 22నే
- రెండు రోజుల ముందే జారీపై అనుమానాలు?

జగిత్యాల, నవంబర్ 25 (నమస్తే తెలంగాణ) : రాష్ట్ర ప్రభుత్వం ఒక రోజు తేదీ వేసి రూపొందించిన ప్రొసీడింగ్‌ను, రెండు రోజుల ముందే జారీ చేయడం విస్మయానికి గురిచేస్తున్నది. ఈ నెల 22న డైరెక్టర్ ఆఫ్ స్కూల్ ఎడ్యుకేషన్ ఒక ప్రొసీడింగ్‌ను జారీ చేసింది. ఆర్సీ నం. 110/ఎస్ఈఆర్.1/2021 పేరిట ఉత్తర్వు వచ్చింది. ఆరు జిల్లాలకు సంబంధించి ప్రస్తుతం పూర్తి స్థాయి జిల్లా విద్యాధికారులుగా బాధ్యతలు నిర్వహిస్తున్న అధికారులను ఇతర జిల్లాలకు బదిలీ చేస్తూ డైరెక్టర్ ఆఫ్ స్కూల్ ఎడ్యుకేషన్ అధికారి ఉత్తర్వులు జారీ చేశారు. నిబంధనల ప్రకారం సంబంధిత శాఖ అధికారులు ప్రొసీడింగ్స్ తయారు చేసిన తదుపరి ఉన్నతాధికారుల ఆమోదం పొందిన తేదీతో ఉత్తర్వులను జారీ చేస్తారు. డైరెక్టర్ ఆఫ్ స్కూల్ ఎడ్యుకేషన్ జారీ చేసిన ప్రొసీడింగ్‌లో 22వ తేదీకి బదులుగా 24 అని వేసి ఉండడం విస్మయానికి గురి చేస్తున్నది. ప్రొసీడింగ్స్‌ను 22 జారీ చేసి, పత్రికల్లో ప్రకటనలు జారీ చేసిన అధికారులు, ప్రొసీడింగ్‌లో మాత్రం 24వ తేదీ వేయడం అందులోను ఆదివారం కావడం ఆశ్చర్య పరుస్తున్నది. ఈ నెల 20న ఒక జిల్లాలోని పాఠశాలలో జరిగిన ఘటన నేపథ్యంలో 21వ తేదీన అధికారిని సస్పెండ్ చేస్తూ ఉత్తర్వులు జారీ చేసినట్టు సమాచారం. సస్పెండ్ అయిన అధికారికి 22న రాత్రి జారీ చేసిన ప్రొసీడింగ్స్‌లో పోస్టింగ్ ఇస్తున్నట్టు ప్రకటించారు. సదరు అధికారి సస్పెన్షన్‌ను రీవోక్ చేయకుండానే ఆఘమేఘాలపై అతడికి పోస్టింగ్ ఏర్పాటు చేసిన అధికారులు, సస్పెన్షన్ రివోక్ కోసం ముందస్తు తేదీతో ఉత్తర్వులు జారీ చేసి ఉంటారనే అధికారులు అభిప్రాయపడుతున్నారు.

